# కూడలి

గైడ్ చక్రవర్తిగారు అమెరికానుండి తిరిగొస్తున్న సందర్భంలో ఫ్లైట్‌కి వెళ్ళి రిసీవ్ చేసుకునే యేర్పాట్లలో హడావుడిగా తిరుగుతున్నాం — గార్లెండ్సు కొనడాలు. పాతికమంది స్కాలర్సుకు సరిపడే యూనివర్సిటీ వానుకోసం గాలించి ఎరేంజ్ చెయ్యడం — ఈ ఏర్పాట్లన్నీ పూర్తి చేసుకుని రూంకొచ్చి టాయిలెట్ అయి సబ్‌మిట్ చేయబోయే ఒక పేపరుమీద సబ్జక్టును చదువుతూ కూర్చున్నాను.

ఈ మూడేళ్ళ రిసెర్చిలోనూ నే చేసిన వర్కంతా ఆయనకు చూపాలని యేముందని వెదికితే సబ్‌మిట్ చేయబోతున్న ఒక్క పేపరు తప్ప మరేంలేదు,

స్వింగ్‌డోర్ చప్పుడైతే తలెత్తి చూశాను.

భాస్కర్ వస్తానన్నాడు—ఇంరు ఫేకల్టీకెళ్ళడం—కేంటీన్‌లో కాఫీ తాగడం—పుస్తకం మాత్రం చేతిలో ఉన్నా అదే ధ్యాసలో ఉన్నాను.

రోజ్‌కలర్ జపాన్ నైలెక్స్ శారీ—మేచింగ్ బ్లౌజు—మెడలో ఎర్రరాళ్ళ నెక్‌లేసూ—జడలో ప్రక్కగా అమర్చబడ్డ కనకాంబరాలు —

ఆమె లోనికొచ్చింది—

ఎప్పుడూ రూంలోనే పాతుకుపోయి పిహెచ్‌డీ కోసమే రాత్రింబవళ్లు గడిపే రాజుకూడా రూంలోలేడు—అతని కోసం ఎవరయినా పైవారు రావటం—ముఖ్యంగా ఆడవాళ్ళు రావటం నేనెప్పుడూ చూడలేదు—మరి యీమె ఎవరు?

కథా నిలయం
658
శ్రీకాకుళం

అప్రయత్నంగానే లేచి నిల్చున్నాను.

"శివరాం గారు మీరేనా?"

"ఆ...అవును..."

,, హ మ్మ య్య బ్రతికిపోయాను త్వరలోనే దొరికారు.'' నుదుటి మీది చిరుచెమటను చీరకొంగు బిగదీసి ఒత్తుకుంది.

,, మీరు—''

,,సుబ్బారావు తెల్సుకదూ మీకు— మెటీరియాలజీ రీసెర్చి స్కాలరు. మాకజిన్''

,,ఐసీ-తెల్సు—కూర్చోండి—మీపేరు రాధకదూ?''

,,అరె—నాపేరు మీకెలా తెల్సు- సుబ్బారావు చెప్పాడా''

నేను నవ్వి వూరుకున్నాను.

సీలింగ్ ఫేన్‌వంక చూస్తూ రాధ రిలాక్స్ అయింది. ప్యూన్‌ని పిలిచి రెండు కాఫీలు తెప్పించాను. ఇద్దరం తాగాం— ఆమె అభ్యంతరంగాని— థాంక్సుగాని చెప్పలేదు.

సుబ్బారావు రూంకి తీసుకువెళ్ళాను. సమయానికి సుబ్బారావు రూం లోనే వున్నాడు.

,,అందుకే మీరూం ఎడ్రెస్ చెప్పా—టవర్ క్లాక్ క్రింది రూం అంటే యీజీగా తెల్సుకోవచ్చుని'' అన్నాడు సుబ్బారావు.

,నేవెళ్ళాలి పనుంది' అంటూ కదిలాను.

,అప్పుడే' ఈమాటన్నది రాధ

,,అవును. కూర్చోవోయ్ శివరాం—'' అందుకున్నాడు సుబ్బారావు

"లేదు- ఎయిరోడ్రోంకి వెళ్ళాలి- వస్తూంటారుగా'' అప్రయత్నంగా

రాధ వంక చూశాను.

ఆమె నవ్వి తలూపింది- తీర్చిదిద్దిన కాటుక కళ్లు ఎంతో ఆకర్షణీయంగా కన్పించాయి.

ఆరాత్రి రాధగురించి ఆలోచన ఆతలపు కొత్తగా అన్పించింది-గదిలో వేలాడదీసిన రాధామాధవుల ఫోటో అందంగా ఆకర్షణీయంగా కన్పించింది,

రెండోరోజు కాక మూడో రోజు రిఫరెన్స్‌బుక్ కోసం లైబ్రరీకి వెళ్తే అక్కడ కన్పించింది రాధ.

దోసగింజలాంటి బొట్టుతో-లేతాకుపచ్చ రుబీవాయిల్ చీరలో అందంగా మొదటిసారికంటె ఆకర్షణీయంగా కన్పించింది- చెవులకు పొడుగ్గా వేలాడే ముత్యాల గుత్తి వుంది.

ఎంతో పరిచయ మున్నదానిలా నవ్వింది.

,,కనిపించడమే మానేశారు కాఫీ యివ్వబడుతుందనా?''

,,అబ్బే ఎందుకు? థాంక్సు యేమన్నానా?''

ఈసారి ఆమె గట్టిగా నవ్వింది- గలగలా ప్రవహించే సెలయేరులా.

,అది సరేగాని సుబ్బారావేడీ?'

యేముంది వాడిపనిలో వాడున్నాడు-కూర్చుందికి బోర్‌కొట్టి యిలావచ్చా'

,మీకు పుస్తకాల పిచ్చని సుబ్బారావు చెప్పాడు - మంచివేమన్నా దొరికాయా__'

మాటలకోసం తడుముకోవలసి వచ్చింది.

ఆరోజు రాధమీద నా ఆలోచన మరింత అల్లుకుంది మనసు అల్లకల్లోలమైంది. రాత్రి సగంవరకూ నిద్రలేదు. మారుమూల గదిలోకి సాయంసంధ్య విసరిన మల్లెల పరిశంలా- ఎండిన కొండ చరియలమీంచి ఆకస్మాత్తుగాపడిన

వర్షపు నీటి ప్రవాహంలా ధారితప్పి మసగ వెల్తురులోకి మెత్తగా ప్రవేశించిన కిరణంలా-ఆశాకిరణంలా రాధ నా మనసులోకి- అప్పుడు- ప్రవేశించింది.

వారం రోజులు గడిచినై —

పార్టీలూ—మీటింగుల గొడవ అయిపోయింది. కొద్దిపాటి సలహాలతో గైడెన్సుతో ఫస్టు పేపర్ సబ్మిట్ చేయడం కూడ జరిగింది. ఎమర్జెన్సీ పనులన్నీ చక్కబెట్టుకుని నేటివ్ప్లేస్‌కి వెళ్ళారు- గైడు చక్రవర్తిగారు. ఆయన మరో మూడు రోజులవరకెట్లూరారు.

ఫేకల్టీలో ధూర్జి భాస్కర్‌తో టేబిల్ టెన్నీసు గేమ్ వేస్తూంటే కబురొచ్చింది.

ఆట మధ్యలో ఆపి ఎవరా అని వెళ్ళి చూద్దునుకగా రూంలో "రాధ"

"ఎవరో అనుకుని హడలి చచ్చా—"

నయమే ఇంతకీ మీరు భయస్థులని తేలిపోయింది" ఆమె నవ్వింది— కూర్చుంటూ—

"దానివల్ల ఇతరులకు హానేంలేదుగా!"

"అఫ్‌కోర్స్! అదే అదను చేసుకుని మిమ్మల్ని భయపెట్టొచ్చుగా"

తెగేదిలా లేదని టాపిక్ మార్చి "సుబ్బారావులేడా.?"

"అంటే? వుంటే మీదగ్గరకు రాకూడదనా? చెప్పండి"

ఆ దెబ్బతో కూలిపోయాను.

"అబ్బె!—అదేంగాదు—వూరికే అడిగా"

ఆమె నవ్వింది. చూశారా—భయపడి పోయారు అన్న అర్ధంతో శబ్దం లేని అందమైన నవ్వది—మాటల్లో చెప్పింది. ఈరోజు ఆమె వచ్చేది కాదుట. ఇంట్లో బోర్ కొట్టి బుక్స్‌కోసం వచ్చి చూస్తే రూంలో సుబ్బారావులేడు—

"పోనీ కూర్చోండి. గంటలో వచ్చేయవచ్చు"—అన్నా

తన కుటుంబ విషయాలన్నీ చెప్పడం మొదలు పెట్టింది తల్లీదండ్రీ విజయవాడలో పెద్దక్కదగ్గర ఉంటున్నారట. వాళ్ళ చిన్నతనంలోనే భర్తను కోల్పోయిన వాళ్ళ పెద్దక్క తను చదివి ఉద్యోగం సంపాదించి తండ్రికి సాయముగా వుంటుందిట. ఒక అన్నయ్య బెంగుళూరులో యేదో ఉద్యోగం చేస్తున్నాడట తనిప్పుడు వుండటం అతనిదగ్గిరే అని కూడ చెప్పింది ఫైనలియర్ బియ్యే పూర్తి కావడంతో చిన్న టూర్ వేద్దామని యిలా వచ్చిందట—

"మీ స్వంతవూరు ఇదేనా" అడిగింది రాధ

"ఓ పుట్టింది కూడ యిక్కడే" అన్నా—

"ఇక్కడే సెటిల్ అవుదామనుకుంటున్నారా?"

"మనం అనుకుంటే జరగొద్దూ—"

"పోనీ జరిగేవే అనుకోండి—రాధ మాటకు తికమక పడ్డాను. ఆమె చూపులో కొత్తదనం గమనించాను—

పన్నెండయింది లావుంది కేరేజీ మనిషి కేరేజీ దింపి వెళ్ళింది.

"మీరు భోంచేస్తారు కాబోలు"

"ఫర్వాలేదు—లేటుగా తినటం అలవాటే"

"నేనున్నాననేగా?"

"అదేం కాదు- మరి మీరో?"

"నేనూ భోజనాని కొచ్చేదా?"

ఆమె చిలిపిగా సరదాగానే అంది- నేమాటాడక పోవటం చూసి.

'చూశారా అప్పుడే భయపడి పోయారు. నేనాడపిల్ల ననేగా మీ భయం'

'అబ్బే- మరి మీరు నన్ను పిరికివాడికింద జమకడుతున్నారు-'

'అదేంకాదు-ఎవరయినా మీఇంట్లో చెబితే-'

'ధాందేముంది- ఫ్రెండుషిప్‌కి అంతేమిటి?'

'పోన్లెండి మీకు బెస్టు ఫ్రెండుగా నన్ను వుండనివ్వండి'

'అంతే'

ఆమె నవ్వి లేచింది. అటువంటి నవ్వే నాకర్థంకాంది. అలాటి నవ్వు నేనిదివరకు చూడలేదు.

ఆమర్నాడు సాయంకాలం బస్‌కోసం వెయిట్ చేస్తుంటే సుబ్బారావు కన్పించాడు.

'నిన్నెక్కడికి పోయావోయి' అన్నా మామూలుగా

'రాధ వచ్చిందటగా చెప్పింది-నువ్వు భోజనం చేయమని బలవంత పెట్టావటగా'

'ఆఁ యేదో -మరి గెస్టు- అయినా చెయ్యలేదుగా'

'రాధ ఉత్త అల్లరి పిల్ల- నువ్వొట్టి పిరికివాడివట- నిన్నెంతలో తేల్చే సిందో చూడు'

నేను మాట్లాడలేదు- అంటే జరిగిందంతా పూసగుచ్చినట్టు చెప్పిందన్న మాట-ఇటువంటి వారితో ప్రమాదమే.

అన్నట్టు- చెప్పడం మరిచా- యీ రాత్రి ఎక్స్‌ప్రెస్‌కే రాధ వెళు తోంది. వాళ్ళనాన్నగారికి బాగోలేదని టెలిగ్రాం వచ్చింది.

'ఇంత సడన్‌గానా'

'పెద్దవయసుగా మరి- రాధ మరీయిదయ్యింది నీతో చెప్పలేదని-'

బస్సువస్తే ఎక్కి యిల్లు చేరుకున్నాను. ఆరోజు నా ఆలోచనలను అరి కట్టలేకపోయాను.

రాధ నాగురించి ఏమనుకుంటుందో తెల్సుకునే అవకాశం కలగలేదు. ఆమె మాటల అర్థాల్లోంచి మనసులోకి ఎలా చూడ్డం- ఆ అందమైన కళ్ళలో- ఆ చిలిపినవ్వులో ఎన్ని వసంతాలు పరిమళిస్తాయో ఎన్ని అనురాగాలు దాగి వున్నాయో లెక్కకట్టగల నేర్పరితనం నా కెప్పుడొస్తుందో,

రాధ విజయవాడ వెళ్ళిన మూడురోజుల తర్వాత యూనివర్సిటీ ఎడ్రసుకు ఓ లెటరు వ్రాసింది. ఆమెలాగే అందంగా పొందిగ్గా వున్నాయి అక్షరాలు చదవటం మొదలు పెట్టాను.

శివరాంగారూ !

మీరు చాలా అమాయకులూ భయస్తులూను - అందుకే మీయింటి ఎడ్రసు తీసుకున్నా మీరూం ఎడ్రసుకే రాస్తున్నా - ఎవరన్నా మిమ్మల్ని అల్లరి పెడితే అందుకు నేను బాధ్యురాలిని కాను

మీతో చెప్పకుండా వచ్చేసినందుకు ఎంత బాధపడ్డానో తెల్సా — మీకేం అన్పించలేదా— ఎంతైనా మిమ్మల్ని నేను అర్థంచేసుకున్నంతగా మీరు నన్ను అర్థం చేసుకోలేరు. చేసుకున్నా అలా కన్పించరు. అది మీలో ప్రత్యేకత.

మానాన్నగారి పరిస్థితి మెరుగ్గానే వుంది.

మాకజిన్ కన్పిస్తున్నాడా? ఆ మనిషి మారేరకంలా కన్పించలా. ఆడపిల్లలతో మాట్లాడాలంటేనే చికాకుపడతాడు. ఎప్పటికి మారతారో యీ మొగాళ్ళు.

మరోసంగతి—మీకు లెటర్స్ వ్రాసే అలవాటుందోలేదో నేను తెల్సుకోలేదు. నాకు మాత్రం రాయాలనిపించింది. మిమ్మల్ని రాయమని కోరుతున్నాను ఇందులో తప్పుగాని, భయపడవలసిన విషయంకాని లేదనుకుంటే వ్రాయండి.

—రాధ.

రాధ నాకే ప్రత్యేకంగా ఎందుకు రాసిందో అర్థంకాలేదు. సుబ్బారావుకు రాసి నాయోగక్షేమాలడగొచ్చుగా. సుబ్బారావుకీ సంగతి చెప్పాలా వద్దా అన్న మీ మాంసలో పడ్డాను — తీరా చెప్పకపోతే తనే యీ సంగతి అతనికి రాస్తే—

మరోరెండు రోజుల్లో మరో ఉత్తరం - ఈమాటు ఉత్తరంతోపాటు ఫోటోకూడా జతచేసివుంది. ఉత్తరం చదివాను

శివరాంగారూ !

ఆశ్చర్యపోతున్నారా — అంతేలెండి. అయినా మీ పనిలోపడి మొదటి లెటర్‌కి రిప్లైయి రాస్తారో లేదోనని మళ్ళీరాశా మిమ్మల్ని తలవని ఘడియలేదు. అక్కడ మీరు తప్పితే మరెవరితో పరిచయమైంది గనుక — ఈ హాస్పిటలూ రోగులూ, బోరింగుగా వుంది. బహుశ నాన్నగారిని రెండురోజుల్లో డిశ్చార్జి చేస్తారు.

ఊరికే ఒకరినుండి ఏదీ ఆశించకూడదు— అందుకే నా ఫోటో పంపుతున్నా— మీ లేటెస్టు ఫోటో పంపితే ధన్యురాల్ని. ఇంట్లో భయపడి పాతఫోటో గాని పంపేరుగనుక?

నా ఫోటో నచ్చకపోతే వెంటనే పంపించెయ్యండి — ఇబ్బందిలేదు.

—రాధ

నాలుగురోజుల పరిచయంలో యేముందని యీ చొరవ నాలో ఆకర్షించుకొన్న ఆమె ప్రతిరూపం కూడ మనసులో కొంత సంచలనాన్ని లేవదీస్తోంది. అది ప్రేమో! అభిమానమో— మరోటో. ఆమె అంది "కనీసం మీబెస్ట్ ఫ్రెండ్‌గానన్నా" అంటే ఆమె వుహ?

వారం రోజులు గడిచాయి. చక్రివర్తిగారు రావడంతో మళ్ళీ పాకంలో పడ్డ యీగలా రూంలోనే వుండిపోవల్సి వచ్చింది.

ఈసారి చక్రవర్తిగారు తన సిస్టర్‌ని వెంటబెట్టుకొచ్చారు ఆమె పేరు కవిత. కవిత విజయనగరం కాలేజీలో బియస్‌సీ ఫైనలియర్ పరీక్షలు వ్రాసిందట క్లాస్ కూడ రావచ్చని అనుకుంటున్నారు. నెక్స్‌టియిర్ ఎం ఎస్ సీలో జేర్పించా

లని అతని వూహ. యూనివర్సిటీ వాతావరణం, చూసేందుకే ఆమె వచ్చింది

పరిచయమైన మరుక్షణం నుండే గమ్మత్తుగా మాతో కల్సిపోయింది

"మీరు ప్యూర్ ఫిజిక్స్ ఎందుకు తీసుకున్నారు" అదీ ఆమె మొదటి ప్రశ్న

"నాకు నచ్చిందీ— సీటు వచ్చిందీ కనుక"

"భలేవారే— నాకుమాత్రం న్యూక్లియర్ ఫిజిక్సు తీసుకోవాలని వుంది మీరన్నట్టు సీటువస్తేనే. అన్నయ్య కిష్టంలేదు."

నవ్వి "మీకంత యిష్టంగా వుంటే ఆయన మాత్రం ఎలాకాదంటారు? కృషింతా మీసైనే ఆధారపడి వుంటుందిగా"

'అవుననుకోండీ, కానీ అనుభవంమీద చెప్పినవారు అన్నయ్య. పెద్ద వాళ్ళమాటను కాదనే స్థితిలో లేనుగా నేనిప్పుడు"

చిక్కులో పడ్డాను-- 'నేననేది అదికాదు— మీ అభిప్రాయాన్నే వారిష్ట ప్రకారం మలవవచ్చుగా'

'సర్లెండి. అంతటిశక్తి నాకులేదు. ఇంతకీ క్లాస్ రావాలిగా'

కవిత మంచితనాన్ని. దూరదృష్టినీ నిరూపించటానికి ఆమె మాటలు చాలవు.

ఓరోజు సుబ్బారావు కలిసి మాటల సందర్భంలో చెప్పాడు రాధ విజయ వాడనుండి బెంగుళూరు వెళ్ళిపోయిందని ఆమె ఎడ్రెసు సుబ్బారావునడిగి తెల్సుకోవాలనిపించలేదు.

వేసవి గడిచింది. కవిత బియస్సి క్లాసులో పాసై యంఎస్సీలో జాయి నయ్యింది. రాధకూడ బియ్యే పాసయి ఉద్యోగాన్వేషణలో వుందని సుబ్బారావు చెప్పగా తెల్సింది.

నా థీసిస్ మీద వ్రాసి పంపిన బ్రీఫ్ ఆర్టికల్సు ఫారెన్ మాగజైన్స్‌లో ప్రింటింగుకు అంగీకరింప బడ్డాయి. చేస్తున్న కృషి వృథా పోలేదనిపించింది.

ఈలోగా మద్రాసు ఐబిఎమ్‌లో సి.యి పోస్టుకు యింటర్వ్యూకి వెళ్ళాల్సివచ్చి బయల్దేరాను

మద్రాసు వెళ్ళడం ఇంపీరియల్‌వంటి పెద్ద హోటల్లో వంటరిగా దిగటం అదే మొదటిసారి ఎలాగూ యేఎఫర్టూలేదు గనుక ఆ పోస్టు వచ్చే ఆశ లేదు- ఇంటర్వ్యూ అయ్యాకకూడ కొద్దిరోజులక్కడ వుండాలనే వూహ కలిగింది- ఆకస్మాత్తుగా రాఘవరావుగారు ఎగ్మూర్‌లో కలియటం, కాకనేకాదు యింటికి రమ్మని బలవంతం చేయటంవల్ల సరేఅనక తప్పింది కాదు. రాఘవరావుగారితో ఎక్కడో దూరపు బంధుత్వమున్నా అంతకుమించిన మా ఫేమిలీ ఫ్రెండు ఆయన- అందుకే అంత తేల్గ్గా ఆయన మాటను కాదనలేకపోయాను-

అనుకోకుండా ఓరోజు సాయంకాలం పేరీస్‌కార్నర్‌లో కన్పించింది రాధ

'చాలరోజుల తర్వాత మీవూరు కదిలినట్లున్నారు? అడిగింది రాధ

'యేదో యింటర్వ్యూకొచ్చా'

'అదిసరే- మీరిసెర్చి ఎంతవరకు వచ్చింది?'

'పర్వాలేదు- డాక్టరేటు రావచ్చు'

నవ్వి వూరుకున్నాను-

బుహారీలో కాఫీ తాగుతూ అన్నాను

'మళ్ళీ మీరు కలుస్తారనుకోలేదు'

'మొదటకూడ మనం అనుకోకుండానే కలిశాంగా- బహుశ అనుకుని కలవలేమేమో- ఇంతకీ మీరెందుకు లెటర్‌కి రిప్లైయి యివ్వలేదో చెప్పారుగాదు'

దొరికిపోయాను—

"యేముందీ మామూలే. బిజీ సుబ్బారావు రాస్తుంటాడనుకుంటా"

యేమనుకుందో "మీకిష్టం లేనప్పుడు బలవంత మెందుకు. అందు కేరాశా తప్పుగా భావించకపోతేనే రాయమని"

"అదేంలేదు. యిష్టమైన పన్నీ చెయ్యలేంగా."

నావైపు అదోలా చూసి తలొంచుకుంది

"ఎలాగూ వచ్చారు. నాలుగురోజులుండకూడదూ"

"ఎందుకూ" అడిగాను

"ఏంలేదు. మీకిష్టమైతేనే"

పాండీబజార్‌లో వాళ్ళబాబాయి ఒకాయన వున్నారట, ఆయన తనకేదో ఉద్యోగ ప్రయత్నం చేస్తానంటే వచ్చిందట

ఆ మర్నాడు మూర్‌మార్కెట్ దగ్గిర కలిసింది

బీచికి పోదామంటేకాదు పిక్చర్‌కి పోదామంది బోరింగా ఫీలవుతోందిట

సఫైర్‌కి వెళ్దామంటే సరేనన్నాను

"సిడ్నీ పోయిటర్" పిక్చర్సు తను లైక్ చేస్తుందట

సినిమానుండి వస్తూ అన్నాను

"మళ్ళీ మీరు కన్పిస్తారో లేదో, నేనేసమయంలోనన్నా వెళ్ళిపోవచ్చు" నావంక అదోలా చూసింది

అవేకళ్ళు. ఆనందమొచ్చినప్పుడూ మరేకళ్ళతోమా సాటిరాని కళ్ళవి.

అప్పుడు రాధ చాల అందంగా కన్పించింది

టాక్సీపిలిచి యిద్దరం ఎక్కాము

ఆమె, పక్కనేను కొత్తగావుందా అనుభవం. మౌంటురోడ్డులో టాక్సీ మెత్తగా జారిపోతుంటె మనసులో చెలరేగిన భావాలకు కొత్తకొత్త కోరికలు

చిగురులు వేస్తున్నాయి. ఆమెనుండి సన్నజాజులు గుబాళించిన వాసన మందుగా మత్తుగా వస్తోంది. ఒకరివంక ఒకరు చూసుకోవాలనే తపన, యేదో చెప్పాలనే ఆత్రత, ఇద్దరిమధ్యా చెలరేగింది.

"రాధా" మౌనాన్ని చీలుస్తూ వచ్చిందామాట

"వూ" ఆమెకళ్ళు జ్యోతుల్లావెలుగుతున్నాయి

"నేవెళ్ళిపోతానంటే నీకేం అన్పించలేదా"

ఆమెనుండి సమాధానం రాకపోయేసరికి ఆమె కళ్ళల్లోకి అప్రయత్నం గా చూశాను,

రాధ కళ్ళలో నీళ్లు నిలిచి వున్నాయి. కలవరపడ్డాను.

"తప్పుగా యేమన్నా అన్నానా"

లేదన్నట్టు తలూపింది. రాధనలా చూడటం అదే ప్రథమం.

"మరి"

"యేంలేదు విలువైన వాటిని మనసు కాక్షించినపుడు అది అందకుండా ఒదిలించుకు పోతున్నప్పుడూ బాధకాక మిగిలేదేముంది?"

"మీరు విలువైన వనుకున్నవన్నీ నిజంగా విలువైనవి కావద్దూ?"

రాధ నవ్వింది

బాధలోంచే అందంగా, అద్వితీయంగా

ఆ మర్నాడే మద్రాసునుండి బయల్దేరి వచ్చేశాను. నెల్లాళ్ళు తిరగలేదు. సుబ్బారావు కనపడి చెప్పాడు రాధకు పెళ్ళని. నిశ్చయ తాంబూలాలుకూడ తీసుకున్నారని. అతను మద్రాసులో ఏదో బిజినెస్ చేస్తున్నాడట. రాధ పెళ్ళి గురించే మద్రాసు వచ్చిందని అతనంటే ఆశ్చర్యపడక తప్పలేదు

రాధ ఎందుకాసంగతి తనతో చెప్పలెదు? అన్నీ తెల్సి ఎందుకు తన నంత కవ్వించింది! ఎందుకు తనతో అలా క్లోజుగా మువ్ అయింది. బహుశ

తనగురించి మంచి అభిప్రాయం లేకనా. ఆరోజు ఆమె మాటలకు, ఆకన్నీళ్లకూ అర్థం? మనసులో మెదిలే ప్రశ్నలతో ఆలోచనలతో ఆరోజు నిద్రలేదు. మూడో రోజు సుబ్బారావు శుభలేఖ తీసుకువచ్చి యిచ్చాడు

అప్పట్లో అనుకోక పోయినా తర్వాత అన్పించింది రాధకు తనేమీకాడా తనే స్వయంగా శుభలేక పంపొచ్చునే!

పెళ్ళికి వెళ్ళలేదు. సుబ్బారావుచేతే బహుమతి పంపాను.

రోజులు గడుస్తున్నాయి- డాక్టరేటు లభించటం యూనివర్సిటీలో ఉద్యోగం రావటం జరిగి పోయాయి కవిత ఫైనలియర్లోకి వచ్చి తనకు స్టూడెంటు అవటంతో అంతకుముందున్న పరిచయంతో చాల చనువుగా తనతో వ్యవహరించేది

కవిత అందమైందని చెప్పలేను కానీ ఆమెమాటల్లోని మాధుర్యం యే అలంకరణలూ లేని ఆమె రూపం చప్పున ఆకర్షిస్తాయి

,,మేష్టారూ మీరింకా ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?'' అనడిగింది కవిత ఓరోజు.

,,లక్షలు కట్నమిచ్చే వాళ్ళెవరూ దొరకలేదా'' అన్నట్టుందా ప్రశ్న

,,నాకింకా ఆవూహ రాలేదు''

,మీరనుకునే వరకూ మీ వయసు నిలుస్తుందా?'

ఎంత అందంగా ప్రశ్నించింది

మరో రోజు పాంబీచ్‌లో కన్పించిఅంది.

,నేనిలా చదివి డిగ్రీలు సంపాదించడం నాన్నగార్కి యిష్టంలేదు. పెళ్ళి చెయ్యాలని ఆయనవూహ— ఎంతైనా ఆడపిల్ల బరువేగా'

,మరెందుకు చదివించారు'

'అంతా అన్నయ్య పట్టుదల, నన్నుఫారన్ పంపించాలని చూస్తూన్నాడు

'మంచిదేగా' అన్నా— యేదోఒకటనాలి అన్నట్టుగా

యేంమంచిదో...నాకు మానాన్నగారి అభిప్రాయమే నచ్చింది'

ఆలోచించి చూస్తే కవిత వూహకూడ నిజమే ననిపించింది ఎంత చదివినా ఆడది ఆడదే. పెళ్ళికాని మగాడికంటే పెళ్ళికాని ఆడది లోకానికి లోకువ

రాధకా వూహ ఉందోలేదో నిశ్చయంగా చెప్పలేదు. అయినా ఆమె గృహిణిగా మారింది ఆమారటానికి మునుపు తనను లొంగదీసుకుంది మనసుకు బంధం వేసింది, తనగిరిలోకి లాక్కొని తన ఆకర్షణకు అంకింతం చేసింది.

కానీ—కానీ—ఆమె చేయలేకపోయింది ఒక్కటే — అదే నిజాన్ని సూటిగా మాట్లాడ లేకపోవటం

తన యిష్టాన్ని ఎదుటివారి యిష్టంతో జతచేసి జీవితాన్ని సుఖమయం చేసుకోలేక పోవటం. ఆలోచనతో యేళ్ళు గడిచాయి

కవితకు ఫారన్ ఛాన్సు వచ్చివెళ్తున్నా ఆశ్చర్యమనిపించలేదు.

ఎన్నో దారులనుండి వచ్చి ఒక కూడలిలో కల్సుకున్న వ్యక్తుల అభిప్రాయాలన్నీ ఒకటి కానక్కరలేదు— ఎవరిదారి వారిది. ఎవరు చేరవలసిన గమ్యంకోసం వారా దారి తొక్కక తప్పదు.

( మార్చి 1973 స్వాతి )